


# వెలుగు

బలివాడ కాంతారావు

మదన్‌లాల్, యీ అమ్మాయిని పదీ హేనేళ్ళనుంచీ చూస్తున్నా, ఆమె పేరు మాత్రం ఈ నాటికీ తెలియదు. అతను హైస్కూలు వదిలిన తర్వాత, తండ్రి యెవరినో బ్రతిమాలి వేయించిన గుమాస్తా ఉద్యోగంలో చేరిన కొత్త రోజుల్లో తొలిసారి యీ పిల్లను చూశాడు.

న్యూఢిల్లీలో, పూసారోడ్డుమీద బస్సు స్టాపు. ఆఫీసుకు పోడానికి వుదయం బస్సుకోసం నిల్చున్నాడు. ఫిబ్రవరి నెలా ఖరురోజులు. ఇంకా చలి యెండను యెదిరిస్తోనే వుంది. చిలకముక్కుల్లాంటి చిగురాకులతో చిగురించిన చెట్లు, రోడ్డు కిరువైపులా వున్నాయి. మృదుత్వంతో మురిపిస్తున్న ఆ మొగ్గల్లాంటి లేత ఆకులను, పిట్టలు ముద్దు పెట్టుకొని, యింకా నిదుర వీడి లేవని చంటిపిల్లలకు మేలుకొలుపు పాడుతున్నాయి

అలాంటి సమయంలో ఒక పాప. తేటంగా వున్నా. అర్భకంగా వుంది. మెడలో పుస్తకాల సంచి, చేతిలో సిలవరు కేరియరు. లేత నీలిరంగు కమీజ, చిరిగిన నీలిస్వెట్టర్. అక్కడక్కడ చిరిగిన చుడీదార్. చిరిగిన బూట్లు. ఏడేళ్ళునిండని పిల్ల. రాజేంద్రనగర్ స్కూలుకు పోడానికి కరోల్‌బాగు నుంచి వస్తూ పూసారోడ్డు దాటాలి. ఈ రోడ్డు వుదయం తొమ్మిది దాటాక దాటడం అంత సులువుకాదు. ఈ రోడ్డుమీదే — క్లాసులో ఫస్టు వచ్చానని గెంతుతూ రిపోర్టు పట్టుకుని యింటికి పోతున్న ఒక పిల్లను ఒక మోటారు సైకిలుమీద మోటుమనిషి తొక్కించేసాడు. ఆ తల్లిదండ్రికి ఒకే సంతానం - చేతిలో రిపోర్టు పట్టుకునే అక్కడే చచ్చిపోయింది. కొత్తగా పెళ్ళి చేసుకుని హనీమూన్‌కి ఢిల్లీ వచ్చిన ఒక పంజాబీజంట ఒకరి చెయ్యి యింకొకరు పట్టుకుని రోడ్డు దాటుతుంటే ఒక టాక్సీడ్రైవరు చక్కని చుక్కని చొట్టచేసి జీవితకాలం దుఃఖంలో ముంచేశాడు.

ఇంత తొందర పడుతున్న మనుషులు. తోటి జీవితాలతో చెలగాటం ఆడటానికి రంగస్థలమైన యీ రోడ్డు దాటడానికి, ఆ పాప చేస్తున్న ప్రయత్నం రోజూ మదన్‌లాల్ చూస్తున్నాడు. ఆ పిల్ల చెదరిన కళ్లు యిటు అటూ చూస్తూంటే.... మానవ సమూహంలో చిక్కిన లేడిపిల్ల కళ్ళులా.... రెండు అడుగులు ముందుకు వేసి మళ్ళీ వెనుకకు పేవుమెంటు మీదకు పరుగెత్తినప్పుడు పిల్లిని చూసి తిరిగి పరుగెత్తే యెలుక పిల్లలా - అలా నిముషాలకొద్దీ చూస్తుంటే....

ఆ రోడ్డు మీదనుంచి .... మోటారు సైకిలుమీద యింకా నైట్‌డ్రెస్ విప్పకుండానే పెళ్లాన్ని వెనక్కూర్చోబెట్టుకుని

ఆఫీసుకుచేర్చే బద్ధరస్తుడు....ఆవె పీపు మీద కండలకు మూడొంతులు వదిలి రెండు చేతుల్తో మొగుడు పొట్టన పట్టి వేసినా సర్దాకైనా సడన్ బ్రేక్ వేయని ఆ మగాడు.

పిల్లలకు స్కూలుకు చేర్చడానికి లేచిన వెంటనే బెడ్‌కాఫీ, ముఖం కడుక్కకుండానే మూతికి ముఖానికి రంగు పులుముకుని, కారు స్టీరింగు పట్టుకున్న సహచారిణి - యింటింటికీ పాచిపనులు చెయ్యడానికి చిక్కిన పెళ్ళాన్ని సైకిలుమీద చేర వేస్తున్న తాగుబోతు....

ఒక మూడు చక్రాల స్కూటర్, ఒక జంట సరసాలాడుకుంటూంటె అప్పుడప్పుడు వెనుతిరిగి చూస్తున్న డ్రైవరు. వ్రేలాడుతున్న మనుషులతో వుయ్యాల లూగిస్తూ వీరావేశం యెత్తుకుంటూ పోతున్న పబ్లిక్ బస్సులూ, అంత యెత్తు పెట్టి మాస్కు వేసినా చేతికి విష్ణుచక్రం వచ్చినట్లు ఝుచ్చు వచ్చినట్లు తిప్పుతున్న లారీ డ్రైవర్లు— ఇలా....

వక్రించిన వ్యూహాలవలన వానలైన నరుల కుప్పిగంతులనించి, తమాషాగా తప్పించుకొని ఒక్కసారి తొందలా అటు వేపు చేరిపోయే యీ పాపవేపు చూచి రోజూ ఆనందించటం మదన్‌లాల్‌కు అల వాటైపోయింది. అలా చూస్తూనే ఆ పిల్ల గురించి యెన్నెన్నో అనుకునేవాడు.

ఆ పిల్ల పేద పిల్ల. బహుశ: తల్లీ దండ్రీ లేకపోయివుంటారు. ఏ ఒక్కరున్నా ఈ రోడ్డు దాటించడానికి వచ్చి వుందురు. ఏ మేనమామ దగ్గరో వుండి వుంటుంది. మేనత్త నానాచాకిరీ చేయిస్తుంటుంది. అందుకే అంత అర్భకంగా వుంది. అయినా మా చక్కగావుంది.

అలా యించుమించు ప్రతి రోజూ ఆ పిల్లను చూస్తూండటం వలన ఏమగుతున్నట్లే కనపడలేదు. పదేళ్ళు పిల్లయినా మదన్‌లాల్ కంటికి యింకా ఆ బెదురు చూపులే కనిపిస్తున్నాయ్. పుట్టుకతో వచ్చిన చిన్న కళ్ళు టపటప కొట్టుకంటూ కాలాన్ని లెక్కించుకు పెరుగుతాయి. ఆ కళ్ళు ఒక వయసులో ఒకో వివిధమైన వెలుగుతో ప్రకాశిస్తుంటాయి. ఒకోరకమైన ఆశలతో అర్థాలతో, ప్రశ్నలతో కదలాడుతూంటాయి. ఒకనాడు బెదరిన లేడి పిల్ల కళ్ళైనా యీ వేళ తను బస్సులో తన ప్రక్కన కూర్చున్న యిరవై రెండేళ్ళ సుందరివి: ఆ కళ్ళ కదలికలో కమనీయమైన కవిత్వం వుంది. అసలు అవి బాసలు చేస్తున్నాయ్. దిగువనున్న రంగురాసిన పేదాల సవ్వను, ఆ కళ్ళు చూడలేక పోయినా వాటికి ప్రభావం వలనే ఆ చిరు నగవు పచ్చిందని ఆ కళ్ళకు తెలుసు. భావాన్ని మనోహర భంగిమలతో మౌనంగా పెదాలమీద నృత్యం చెయ్యించేసిన ఆ కళ్ళు! ఒకనాడు బెదిరిన ఆ కళ్ళలో యింత తేజస్సు వుంటుందని, మగవాడ్ని ముగ్ధుడ్ని చేసి, వలపు తాళ్ళతో బంధించి ఆమె పాదాల చెంత చేర్చే ప్రభావం, ఆ కళ్ళకుంటుందనీ మదన్‌లాల్ యేనాడూ అనుకోలేదు.

ఈ ఏప్రిల్ నెలాఖరులో సోమవారం నాడు అసలు జరిగిన సంగతిది. పదిహేనేళ్ళ క్రిందట గుమాస్తాగా చేరిన మదన్‌లాల్....మామ్మూలుగా అఫీసుకెళ్ళే బస్సు యేక్కాడు. పరుగెత్తుతూవచ్చి తన వెనకాలే యింకో అమ్మాయి యెక్కింది. తను కూర్చున్నాక ఆ అమ్మాయి వచ్చి తన ప్రక్కనే సీటులో కూర్చుంది. ఎక్కడో చూసిన ముఖం. తనవేపు పరిచయం వున్నట్లు చూస్తున్న ముఖం. పూయదనుకున్న మొక్క చివరలో మొలిచిన ఒకే గులాబి పూవు. సొగసును దశదిశలు విరజిల్లుతోంది.

వూరికే మదన్‌లాల్ మనసు చలించలేదు. ప్రక్కన కూర్చున్న ఆమె తనను తగిలే కూర్చుంది. పమిటను గాలి ప్రక్కకు లాగగా, క్రీగంట చూసిన చూపుతో అతని మనసులో మల్లెల గుత్తులు మొలిచాయి. హృదయంలో మంగళ వాద్యాలు మ్రోగాయి. ఆమె పెదిమలపై నవ్వు అతని మనసులో శిధిలం కాకుండా పాతుకుంది. తాకిన ఆమె బంగారు శరీరం అతనిలో విద్యుత్తును వుత్పత్తిచేసి శరీరమంతా వ్యాపింపచేసింది.

ఆమె చెంతనున్నది పాతిక నిముషాలే అయినా అతని ముప్ఫయియేడేళ్ళ జీవితంలో మధురాతి మధురమైన క్షణాలు, ఆ క్షణంలో ఉత్పత్తి అయిన విద్యుత్తు జీవితాంతంవరకు తనలో దీపం వెలిగిస్తుందనుకున్నాడు.

ఆఫీసుకు వెళ్ళినా అతను ఏ కాగితం ముట్టుకోలేదు. అసలు తను ఆఫీసులో కూర్చున్నట్లే అనుకోలేదు. ఇంకా బస్సులో ఆ సుందరి ప్రక్కనే వున్నాడు. కిటికీనించి కనిపించే ఆకాశమైనా తనవేపు చూసి ఆమె నవ్విన నవ్వంత విశాలంగా లేదు. రోజూ తను కూర్చుంటున్న కుర్చీ ఈవేళ తన పెళ్ళంలా మోటుగా తగుల్తోంది, చుట్టూ రోజూ తనతో సరదాగా కాలక్షేపం చేస్తుండే గుమాస్తాల మాటలు, జుగుప్స కలిగిస్తున్నాయ్. లంచ్ టైములో పేకాట ఆడేవాడు మరో ముగ్గురితో. ఈవేళ యెవరికీ చెప్పకుండా దూరదూరంగా వెళ్ళిపోయాడు. రాజ్‌పథ్‌లో దక్షిణవేపు జనం లేని గడ్డిబీడువేపు నడిచాడు. నీటిఒడ్డున చెట్టుక్రింద ఒంటరిగా కూర్చున్నాడు. చెదురు చెదురుగా యేవో పిట్టలు నీటిలో కదులుతున్నాయ్. ఎండలింకా ముండిపోలేదు. అతనికి చల్లగానే వుంది. అక్కడనించుని చూస్తుంటే వాయుభవనం యెదరగా నేరెడిపండు, యెరుపు కలిసిన పూలు, పచ్చని టోపీమీద రంగురంగు తురాయిల్లా వున్నాయ్. ఫిబ్రవరిలో మొలచిన చిగుళ్ళు, మార్చికే కనిపించకుండా మాయమై-చెట్టు నిండుగా నీలినీలి పూలగుత్తులు .... అంతా యింద్రజాలంలా వుంది.

ఈ ప్రకృతి నిత్యంచేసే మనోహర నృత్యంలో, యెగురుతున్న పూల వర్షాన్ని యిదివరకు చూసినా, వీటి అందాన్ని ఈ వేళనే అర్థం చేసుకున్నాడు. తను చెయ్యవలసిందేమీ లేదనీ, అంతా జరగవలసింది జరుగుతుందనీ - పబ్లిక్ సర్వీస్ కమీషన్ వైపు రైటింగు టెస్టయినా పాసవటానికి ప్రయత్నించకుండా - యింకా యీ నాటికీ గుమాస్తాగానే చెలామణీ అవుతున్నాడు. తన తండ్రి తన కేమీ ఆస్తి నివ్వలేదని అక్కసు. తన భార్య అందంగా ఉండదని దానికి కారకుడు తండ్రేనని - తన పిల్లలు చదువుకుంటే కష్టాలు హెచ్చిపోయ్యాలనీ.... పెళ్ళం పొరపాటున కొత్తలో పొరుగావిడ బలవంతంమీద లిప్‌స్టిక్ రాసుకుందని, మదన్‌లాల్ పెళ్ళాన్ని కొట్టినంత పనిచేసాడు.

తన భార్యకే ఆ తొలి రోజుల్లో మేరుగులు దిద్దుకోడానికి అనుమతిచ్చివుంటే, ఈ మహాపట్నంలో యిన్ని అవకాశాలుండగా నైట్ కాలేజీలో చదివి ఒక బి. ఏ. అనిపించుకునివుంటే గోస పెపింగు టెస్టు పాసయ్యివుంటే.... పన్నెళ్ళ తరువాతనయినా పుట్టి వుంటే....

ఓ లిప్తలో యిలాంటి ఆలోచనలు అందమైన ఆలోచన మీదకు, వంటపొలంపై మిడతలదండు పడ్డట్లు ఉరకబోయాయ్. కానీ కామపు మంటలు రేపించి ఆనందును వాలకుండా అదిరేసాడు.



ఆ అమ్మాయి యెంచక్కగా తయారయింది! ఆడపిల్లకు వయసు రాగానే దాగున్న వంపులన్నీ పువ్వుల్లా మొలిచిపోతాయి కామోసు. రాత్రిళ్ళ డాబామీద వెన్నెల్లో ఆమే - నిద్రపట్టకుండా వుంది - ఆ రూపే - ప్రక్కన మంచంమీద పడుకున్నది తన భార్యకాదు. తన వూహలో ఆమె. మూడుసార్లు ఆ రోడ్డువేపు వెళ్లాడు. ఆమె కనపడలేదు. ఇది ఒక కలకాదు; నిజంగా ఆమె తనవేపు చూసి నవ్వింది. కావాలని, గాలికి ఎగిరిన పయటను సర్దుకోలేదు. తను అద్దంలో ఈ సంధ్య హెచ్చుసార్లు చూసుకుంటున్నాడు. నీటుగా తయారవుతున్నాడు. జుత్తును నంగలుచేసి సర్దుతున్నాడు. బస్సుస్టాపుకు ముందుగా వెళ్ళి యెదురు చూస్తున్నాడు.

ఒక రోజుకాదు, రెండు రోజులుకాదు - సరిగ్గా వారం అయ్యింది. ఆమె కనపడటం లేదు కానీఅతని సర్వస్వం ఆయిపోయింది. అమె తనని పెళ్లాడటానికి ఒప్పుకుంటే తన జీవితం చిగురిస్తుంది. నలుగురు పిల్లలతో వున్న పెళ్ళానికి విడాకులు యివ్వడానికి అతనికి యెట్టి అభ్యంతరము లేదు. బస్సుస్టాపులో ఈ ఆలోచనలిలా ఉంటుండగా చప్పున ఒక స్కూటరు ప్రక్క సందునించి పరుగెత్తుకవచ్చి, కొంచెంగా ఆగి పూసా రోడ్డుపైకి వచ్చింది. ముందు అందమైన యువకుడు. మగతనం వెల్లివిరుస్తోంది. ఆ వెనకనున్నది మరెవరో కాదు. ఆ జవ్వని పకపకా నవ్వుతోంది. గట్టిగా రెండు చేతుల్తో వాడి పొట్టను పట్టుకుంది. వాడు సడన్ బ్రేకు వేస్తున్నాడు. ఆమె ఫకాలుమని వాడి వీపుతో కుస్తీపట్తోంది - యౌవ్వనం యెగురుతూ వురకలు వేస్తోంది. వయ్యారం వెంట వెంటపడి వదలటం లేదు. వలపు మలుపులు తిరిగి కులుకుతూ ఆజంటకుగిలిగింతలు పెట్తోంది

ఆ క్షణంలో మదన్‌లాల్‌లో వారం రోజులై వెలుగుతున్న మంట ఆరిపోయింది, చాలా సేపటివరకు అక్కడేకూర్చుండిపోయాడు. ఏ ఆలోచనా లేదు. విద్యుత్తును ప్రసరించే బేటరీ పాడైపోయింది. ఆమెనేదేదో చేసేద్దామని కసి ఒక్క క్షణం కలిగాక .... యెదురుగావున్న రోడ్డుమీద తారు కరుగుతూ తన కళ్లల్లోనికి నల్లత్రాచులా చూసింది. ప్రక్కనే వున్న రోడ్డుమీద త్రోవ చూపించే పాతివెట్టిన చలనంలేని ప్లేటుమీద "గంగా మందిర్ మార్గ్" బదులు "మదన్‌లాల్" అన్న అక్షరాలున్నట్లు భ్రమపడ్డాడు. వెనుకనే కాలువొడ్డున పారవేసిన విరిగిన గాజుబుడ్డీలు. కుళ్ళిన బంగాళాదుంపలు, చెడిపోయిన కోడిగుడ్లు.... అవన్నీ తన గుండెల్లోనికి పరుగెత్తాయి. మనోహరంగా యెర్రని పూల గుత్తులతోనున్న తురాయి చెట్టు ఒక్కసారి ఫక్కుమంది. "ఎండకూ గాలికీ నేను నిల్చుని కాలంతోపాటు కదిలాను - నివ్వో!" గతం వద్దనుకున్నా తలుపుకువచ్చింది. అదే బస్సుస్టాపు.... చెట్లు చిగురుస్తున్న కాలంలో ఒక యేడేళ్ళపాప! పేదరికంతో పెనుగులాడుతున్న పాప.... ఈ భీకరమైన రోడ్డు దాటడానికి పడ్డ ప్రయాస.... ఈ రోడ్డు.... మామూలు రోడ్డుకాదు- కాంగోనదిలాంటిది- అందులో మొసళ్ళలాంటివే యీబస్సులూ, స్కూటర్లు వగైరా.... జాగ్రత్తగా దాటకపోతే - మనిషినే మింగేస్తాయి - ఇన్ని సంవత్సరాలు ఆ పిల్ల యెలా దాటగలిగింది? ఎలా యింతది కాగలిగింది! అందరికీ అందని పువ్వయినా అందంచూసి ఆనందించమని వికసించింది. ఇంత మంచి వుద్యోగం చేస్తూ, చక్కని మొగుడ్ని సంపాదించుకుంది - దీనికి యెంత సాహసం, దీక్ష, ధైర్యం కావాలి? అలాంటిపిల్ల ఆ రోజుల్లో రోడ్డు దాటడానికి పడ్డభయం, బెదురుచూసి తను ఆనందించాడు కానీ ఓనాడైనా ఆమె తలికి చేరవేసాడా? అలాంటివాడు ఆమె శీలాన్ని కాంక్షిస్తున్నాడు. ఎదుటి వాళ్ళ కష్టంమీద బతకాలనీ- తోటి వాళ్ళను కించపరిచి దోచుకోవాలనీ తనే చూసాడు - టక్కరి నక్కలా- సోమరిపోతులా....

ఓ క్షణం తను మదన్‌లాల్‌నని మరచిపోయాడు. ఈ సారి తనలో నిజంగా విద్యుత్తు ప్రవహించింది. ఇది కామపు మంటలను రగుల్కొలపలేదు. వెలుగును ప్రసాదించే దీపాన్ని వెలిగించింది.

□□□

---

● పెద్ద పరీక్షలైపోయిన తర్వాత ఒక విద్యార్థి ప్రొఫెసర్‌కు కనబడి నమస్కారం చేసి ఏమిసార్ ! తర్వాత నన్ను ఏం చదవమంటారు? అని అడిగాడు.

ప్రొఫెసర్ పరాకుగా ; "వాంటెడ్ కాలమ్స్" అన్నాడువెంటనే.